క్లుప్తంగా

భక్తి మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న బాబాసింగ్ మహరాజ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి ఒక్కరూ సేవ లాల్ మహరాజ్ చూపిన భక్తిమార్గంలో నడవాలని పొరదేవి పీఠాధిపతి బాబాసింగ్ మహరాజ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బేగంపూర్ తండాలో భవాని మాత, సంత్ సేవ లాల్ మహరాజ్ మందిర వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ వద్ద అన్నదానం చేపట్టారు. తండా పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



యాదారంలో రైతుల విశిష్ట సంఖ్యను నమోదు చేస్తున్న ఏఈవో సంతోశ్

బీబీపేట: మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈవో సంతోశ్ సూచించారు. యాదారం క్లస్టర్‌లో శనివారం రైతులకు వివరాలను నమోదు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ అనే పేరుతో రైతుల వివరాలను నమోదు చేసి వారికి కోడ్ ను ఇస్తున్నట్లు తెలిపారు.

28న విశ్వకర్మల సభకు తరలిరావాలి



కరప్రతాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్ : ఈనెల 28న వరంగల్‌లోని కీర్తి గార్డెన్‌లో నిర్వహించే విశ్వకర్మ సభకు కులస్తులు భారీగా తరలిరావాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాలచారి పిలుపునిచ్చారు.ఈసభకు సంబంధించిన కరప్రతాలను శనివారం పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలకు విద్యుత్ వినియోగాన్ని 10 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీకి పెంచినందుకు ఈఆర్‌సీ చైర్మన్, క్రాస్ సబ్సిడీ అందించడానికి అంగీకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపడానికి ఈసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి సుదర్శన్, ప్రతినిధులు కంది నాగభూషణం, బెజ్జంకి రాజు, సిరికొండ సుదర్శన్, మారుతి, గంగాధర్, లక్ష్మయ్య, శ్రీనివాస్, విశ్వరూపచారి, వెంకటస్వామి, యాదగిరి, భార్గవచారి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం



జవాన్‌ను సన్మానిస్తున్న స్థానిక యువకులు

ఎల్లారెడ్డి: మండలంలోని సోమార్‌పేట గ్రామానికి జవాన్ క్యాస దేవేందర్ భారత్ సైన్యం ఇటీవల చేపట్టిన భారత్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నాడు. ఇటీవల జవాన్ తన స్వగ్రామానికి వచ్చాడు. స్థానిక బజరంగ్‌దళ్ ప్రతినిధులు, ఇతర యువకులు శనివారం జవాన్ దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్ఐ మహేశ్

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను శనివారంఎస్సై మహేశ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, దీన్ని ఎవరు అతిక్రమించవద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం..



పరిశీలిస్తున్న ఆర్ఐ బాలయ్య

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్ఐ బాలయ్య పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ధాన్యం పూర్తిగా తడిసిపోతుందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఆయన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. వేగవంతంగా కొనుగోలు చేసి వెంటనే రైస్‌మిల్ కు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. ఆయన వెంట సొసైటీ సిబ్బంది ఉన్నారు.

అనుమతులకు అటవీశాఖ జాప్యం

- ఏడు కి.మీ.డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రెండేళ్ల నుంచి ఎదురుచూపులు
- రోడ్డు పూర్తయితే నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాల ప్రజలకు మేలు



మెంగారం శివారులో..



అయ్యపల్లి శివారులో నిలిచిపోయిన డబుల్ రోడ్డు

లింగంపేట(ఎల్లారెడ్డి): డబుల్‌రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండటంతో మూడు మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీశాఖ అనుమతి లభించి ఈడబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాల ప్రజలకు మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాలకు వెళ్లడానికి దూరభారంతో పాటు సమయం ఆదా అవుతుంది.నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద నుంచి లింగంపేట మీదుగా గాంధారి మండలం రాంపూర్ గడ్డ వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి ఆర్అండ్‌బీ అధికారులు 31 కిలో మీటర్లకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఇందులో ఏడు కిలో మీటర్ల అటవీ ప్రాంతం ఉంటుంది. అటవీ ప్రాంతంలోని సింగిల్ రోడ్డుకు అనుమతులు రాకపోవడంతో ఆర్అండ్‌బీ అధికారులు 24 కిలోమీటర్లకు అనుమతులు తీసుకున్నారు. రూ.33 కోట్లతో మాల్తుమ్మెద నుంచి రాంపూర్ గడ్డ వరకు 24 కిలోమీటర్లు మేర డబుల్ రోడ్డు వేశారు. మూడు మండలాల పరిధిలో ఏడు కిలో మీటర్ల మేర అటవీ ప్రాంతం ఉండటంతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. లింగంపేట మండలం ఎక్కపల్లి చౌరస్తా, అయ్యపల్లి శివారులో, మెంగారం, బోనాల్, బాయంపల్లి తండా, ఎల్లమ్మగుడ్డి నుంచి రాంపూర్ హనుమాన్ మందిరం వరకు డబుల్ రోడ్డు పనులు అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు అనుమతులు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపర్చడానికి ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు డబుల్ రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

దూరం, సమయం ఆదా అవుతుంది



మాల్తుమ్మెద నుంచి రాంపూర్ గడ్డ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయి.మెదక్,నాగిరెడ్డిపేట, లింగంపేట,గాంధారి మండలాల ప్రజలకు దూరం భారం తగ్గుతుంది. ని జామాబాదు పట్టణానికి వెళ్లడానికి గాంధారి,చద్మల్,మంచిప్ప మీదుగా సుమారు 30కిలో మీటర్లు దూరం తగ్గుతుంది,సమయం కూడా కలిసి వస్తుంది.అటవీ శాఖ అనుమతులు ఇచ్చి ప్రజల ఇబ్బందులుతొలగించాలి. – కిష్టాగౌడ్, రైతు, శెట్పల్లి

అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలి



ప్రజల సౌకర్యం కోసం వేస్తున్న రోడ్ల పనుల కోసం అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలి.మాల్తుమ్మెద నుంచి రాంపూర్ గడ్డ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు మండలాల ప్రజలకు ప్రయాణం సులువు అవుతుంది. ఆర్థిక భారం తగ్గుతుంది.అటవీ ప్రాంతాల్లో నిలిచిపోయిన 7 కిలో మీటర్లు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి. – పచ్చంటి సాయిలు, రైతు బాయంపల్లి

ప్రతిపాదనలు పంపాం

మాల్తుమ్మెద నుంచి రాంపూర్ గడ్డ వరకు 31 కిలో మీటర్లు. ఇందులో అటవీ ప్రాంతం 7 కిలో మీటర్లు ఉంది. ఈఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. – రవితేజ, ఆర్అండ్‌బీ ఏఈ, లింగంపేట

రైతులకు రసీదు తప్పకుండా ఇవ్వాలి

- ఏడీఏ అరుణ
- ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



కామారెడ్డిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ అరుణ

కామారెడ్డి రూరల్: పట్టణంలోని పలు విత్తన దుకాణాలను బాన్సువాడ డివిజన్ నుంచి వచ్చిన విత్తన తనిఖీ బృందం, ఏడీఏ అరుణ, నిజాంసాగర్ ఏవో అమర్ ప్రసాద్‌లు శనివారం తనిఖీ చేశారు. రైతులకు నాణ్యతమైన విత్తనాలను విత్తన చట్టం పరిధికి లోబడి అమ్మాలని సూచించారు. అందరూ విత్తన డీలర్లు తెచ్చుకున్న విత్తన స్టాక్స్ ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఏ స్టాక్స్, ఏ కంపెనీ స్టాక్ తెచ్చుకున్నారో బిల్లులు ఉంచుకోవాలన్నారు. రైతులకు అమ్మిన విత్తనాలకు రసీదు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనవద్దని, డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని కోరారు. విత్తన డీలర్లు ఎవరైనా పత్తి విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్‌తో పాటు డీలర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

నాగిరెడ్డిపేట/నిజాంసాగర్:వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని నాగిరెడ్డిపేట మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ సూచించారు. మండలకేంద్రం గోపాల్‌పేటలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలనుఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్‌ను, స్టాక్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మహమ్మద్ నగర్ మండల వ్యవసాయశాఖ అధికారిణి నవ్య సూచించారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంతో పాటు కొమలంచ, గాలీపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ఉంచాలని సూచించారు.ఫర్టిలైజర్ దుకాణదారులు మహేందర్, వినోద్, కాశీరాం తదితరులున్నారు.



నాగిరెడ్డిపేటలో.. ఏవో సాయికిరణ్



మహమ్మద్‌నగర్‌లో.. ఏవో నవ్య

పాలిసెట్ ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ



రుషికేశ్ | విఘ్నేశ్ గౌడ్ | కౌశిక్‌యాదవ్ | పావని | రాహుల్

భిక్కనూరు : మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాలిసెట్ ఫలితాలలో సత్తాచాటారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపీసీ విభాగంలో పాఠశాలకు చెందిన భూర్ల రిషికేశ్ 462, పాలమాకుల విఘ్నేష్ గౌడ్ 1076 ర్యాంకు సాధించారు, ఎం,బైపీసీ విభాగంలో కౌశిక్ యాదవ్ 1480 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్ ,ప్రిన్సిపాల్, అశోక్ యాదవ్ తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పాలిసెట్ ఫలితాల్లో పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని పావని 573 వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఆమె 573వ ర్యాంకు సాధించడంతో ప్రిన్సిపాల్ అభినందించారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో చదివిన రాహుల్ ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాములు తెలిపారు. విద్యార్థిని సిబ్బంది అభినందించారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

సలాబత్‌పూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, వార్కారీలు ఆలయంలో భజన,కీర్తన కార్యక్రమాలు నిర్వహించారు.

వృత్తి నైపుణ్యాలు మెరుగు పడ్తాయి

- డీఈవో రాజు
- ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



బోర్లంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

బాన్సువాడ రూరల్: వృత్త్యంతర శిక్షణలతో వృత్తి నైపుణ్యాలు ఎంతగానో మెరుగుపడ్తాయని డీఈవో రాజు అన్నారు. శనివారం ఆయన బోర్లం జెడ్పీహైస్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎస్జీటీలకు కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మెరుగైన బోధనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తి కావడం హర్షనీయమన్నారు. ఐదు రోజుల పాటు నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పర్చినప్పుడే శిక్షణకు సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, మండల రిసోర్స్ పర్సన్లు అయ్యాల సంతోష్, సుధాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, వాజిద్ అలీ, రవికుమార్, పండరి, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

రామారెడ్డి/రాజంపేట/తాడ్వాయి/లింగంపేట/కామారెడ్డి రూరల్/ఎల్లారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని రాజంపేట ఎంఈవో పూర్ణచందర్ రావు అన్నారు. రాజంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రామారెడ్డి ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంఈవో ఆనంద్‌రావు తెలిపారు. తాడ్వాయి ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంఈవో రామస్వామి తెలిపారు. కామారెడ్డి మున్సిపల్‌పరిధి కేజీబీవీ టెక్రియాల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంఈవో వై.ఎల్లయ్య తెలిపారు. ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల్లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంఈవోలు రాజులు, షౌకత్ అలీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమార్పీలు, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రాజులు



టెక్రియాల్‌లో శిక్షణలో పాల్గొన్న టీచర్లు

చికెన్ సెంటర్ల యజమానులకు అధికారుల నోటీసులు

- రోడ్డుపై ఉన్న దుకాణాలు ఖాళీ చేయాలని ఆదేశం
- రెండు రోజుల గడువు ఇచ్చిన వైనం

సాక్షి ఎఫెక్ట్..



నోటీసులు అందిస్తున్న జీపీ అధికారులు

బిచ్కుంద(జుక్కల్): మండలకేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డు, మురికి కాలువ ఆక్రమించి వెలిసిన చికెన్‌సెంటర్ల యజమానులకు శనివారం జీపీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు, డ్రైయినేజీ ఆక్రమణ..అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి బిచ్కుంద జీపీ అధికారులు స్పందించారు. డీపీవో మురళి ఆదేశాల మేరకు జీపీ జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్ రోడ్డును ఆక్రమించిన దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల గడువు ఇస్తున్నామని, ఆలోగా దుకాణాలను స్వయంగా తీసేయాలని యజమానులను హెచ్చరించారు. అదే విధంగా వర్షంనీరు వెళ్లకుండా వేసిన మట్టిని కూడా తీయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సు లేని దుకాణాలపై జరిమానా విధిస్తామన్నారు. జీపీ అధికారుల స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి

దోమకొండ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తా చాటాలని పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని గ్రామాల్లో మెజారిటీ సీట్లు గెలుపొందాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందేలా ఇందిరమ్మ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, డీసీసీ కార్యదర్శులు శ్రీకాంత్, స్వామి, మాజీ సర్పంచ్ నల్లవు శ్రీనివాస్, నాయకులు నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీతారం మధు, నేతుల సుధాకర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కనిపించిన అరుద్ర పురుగు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో అరుద్ర పురుగు శనివారం కనిపించింది. సాధారణంగా వర్షాకాలం ప్రారంభమై అరుద్రకార్తెలో కనిపిస్తుంటాయి. ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో శనివారం అరుద్రపురుగులు భూమిలో నుంచి బయటకు వస్తున్నాయి.

ఆధ్యాత్మికం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నేడు తాడ్వాయిలో ఊరదమ్మ పండుగ

తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండల కేంద్రంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊరదమ్మ పండుగను నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేకల రాజు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు మాగిలో బోనాల జాతర



బోనాలకు ముస్తాబవుతున్న పోచమ్మ తల్లి

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామంలో ఊర పండుగ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు పిట్లం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ తెలిపారు. ఈఉత్సవాలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తం

జీలుగ విత్తనాలను సరఫరా చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలానికి జీలుగ విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షాకాలం సమీస్తున్నందున ప్రభుత్వం రైతులకు ముందస్తుగా విత్తనాలను సరఫరా చేయకుండా కాలాయాపన చేస్తుందని విమర్శించారు.

రేపు వేయి అడుగుల జాతీయ జెండాతో ఊరేగింపు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ ఆలయం నుంచి గాంధీచౌక్ మీదుగా పాత బస్టాండ్ వరకు వేయి అడుగుల జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు గ్రామ యువకులు తెలిపారు. సోమవారం జవాన్లకు సంఘీభావం తెలుపుతూ, ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసినందుకు వారికి మద్దతుగా ఈ ఊరేగింపు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు.

గిరిజన గురుకులాల్లో 26న స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్ : మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్ గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. అలాగే నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మాధవరావు పేర్కొన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి వద్ద కొనసాగుతున్న బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు సోమవారం ఉదయం 11గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో దుర్కిలోని కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజ రు కావాలన్నారు. పదోతరగతిలో సాధించిన మార్కుల మెరిట్,రూల్ రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

28న బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో కామారెడ్డి శాఖలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ల పోస్టులకు ఈనెల 28న కలెక్టరేట్‌లోని ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ కలిగి 25 నుంచి 45 ఏళ్లలోపు వారు హాజరు కావాలని, వివరాలకు 83748 97054, 76719 74009 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

పదోన్నతి పొందిన ఏఎస్సై రాములుకు సన్మానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ ఎస్సై రాములుకు పదోన్నతిపై ఎస్సైగా ప్రమోషన్ వచ్చింది. దీంతో స్థానిక బీజేపీ నాయకులు శనివారం రాములును సన్మానించారు.

కోర్సు డైరెక్టర్‌కు ...

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో భాగంగా దోమకొండ మండల కోర్సు డైరెక్టర్ మాణిక్యంశర్మను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. పాఠశాలల ఉపాధ్యాయలు ఉన్నారు.

క్లుప్తంగా

పనితీరును మెరుగుపర్చుకోవాలి

రాజంపేట : గ్రామ సంఘాలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని మండల ఐకేపీ ఏపీఎం సాయిలు అన్నారు. రాజంపేట మండల సమాఖ్య భవనంలో శుక్రవారం గ్రామ సంఘాల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో 2025– 26 బ్యాంకు రుణ లక్ష్యాలను సంఘ సభ్యులకు వివరించామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ వికాసం గురించి సంఘ సభ్యులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో సీవోఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జొన్నలు తడవకుండా కాపాడాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బాన్సువాడ మండల వ్యవసాయాధికారి ఫయాజుల్లా తనిఖీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జొన్నలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జొన్నలపై టార్పాలీన్లు కప్పి ఉంచాలన్నారు. ఆయన వెంట కోనాపూర్ క్లస్టర్ ఏఈవో జ్ఞానేశ్వర్, సొసైటీ సిబ్బంది శేఖర్ ఉన్నారు.

అభ్యంతరాలను జేపీసీ పరిగణనలోకి తీసుకోలేదు



కామారెడ్డి టౌన్: ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాబా గౌడ్ ఫంక్షన్ హాల్ లో వక్ఫ్ సవరణ బిల్లుపై శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ హాజరై మాట్లాడారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఆమోదించిన సవరణలు వక్ఫ్ బిల్లును మరింత క్లిష్టంగా మార్చాయన్నారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల అభ్యంతరాలను జేపీసీ పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. ఇందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాలు, అంబేడ్కర్, విద్యార్థి యువజన సంఘాలు, నాయకులు క్యాతం సిద్ది రాములు, కొత్తపల్లి మల్లయ్య, మక్సూద్, మసూద్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

25న మలిదశ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం



బాన్సువాడ : ఈ నెల 25న మలిదశ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యమ కారుల సంఘం అధ్యక్షులు ఉడుత గంగాధర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ మలిదశ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఉందని, ఈ సమావేశానికి మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ హాజరవుతున్నారన్నారు. డివిజన్‌లోని మలిదశ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు.కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు చందు, మహేష్, భాస్కర్‌గౌడ్, కృష్ణ, గంగారం, పవన్, సురేష్, బాబురావు, వెంకటి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను శుక్రవారం తహసీల్దార్ సవాయిసింగ్ పరిశీలించారు. రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ధాన్యం కుప్పలతో పాటు ధాన్యం బస్తాల నిల్వలు, ధాన్యం సేకరణను తెలుసుకున్నారు. ఆయన వెంట సొసైటీ సీఈవో రాములుసేట్, సిబ్బంది భాస్కర్ తదితరులున్నారు.

26న రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి లయన్స్ క్లబ్, ఆదిత్య ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియ వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం ఈనెల 26న పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరి మారుతి తెలిపారు. రక్తదాతలకు లయన్స్ క్లబ్ తరఫున ప్రోత్సాహకంగా స్టీల్ వాటర్ బాటిల్, ప్రశంసపత్రం అందజేస్తున్నట్టు అధ్యక్షుడు మారుతి పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు వచ్చేనా...?

- ఆశావహుల్లో ఆందోళన
- వేలల్లో దరఖాస్తులు.. వందల్లో మంజూరు
- బాన్సువాడ సెగ్మెంట్‌లో ఇంకా ప్రారంభం కాని పథకం



బోర్లం క్యాంపులో సర్వేచేస్తున్న అధికారులు (ఫైల్)

బాన్సువాడ రూరల్ : పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం బాన్సువాడ సెగ్మెంట్‌లో అందని ద్రాక్షలా మారనుంది. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈనేపథ్యంలో సర్వే జాబితాల్లో చాలాచోట్ల నిజమైన లబ్ధిదారుల పేర్లు ప్రతిపాదించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా సొంత ఇల్లు కట్టుకుందామనే ఆలోచనతో ఉన్న ఆశావహులు తమకు ఇల్లు మంజూరు అవుతుందో లేదోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు 8,957.... మంజూరు 633

బాన్సువాడ మండలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాకోసం ప్రజాపాలనలో 8,957 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎల్1లో 2,796, ఎల్ 2లో 3,391, ఎల్ 3లో 2,770 దరఖాస్తులు ఉన్నాయి. తొలి విడతలో బాన్సువాడ మండలానికి తొలివిడతలో 633 ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే మంజూరు కాగా వీరిని ఎల్1లో నుంచి ఎంపిక చేస్తారు. ప్రజాపాలనలో భాగంగా ఎంపికైన నాగారం గ్రామానికి 78 ఇళ్లకు మంజూరు లభించగా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో తీవ్ర జాప్యం మూలంగా, జాబితా రూపకల్పన ఆలస్యమైంది. ఎట్టకేలకు పక్షం రోజుల క్రితం ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలకంగా మారి అందించిన జాబితాపై గెజిటెడ్ అధికారులు రీ సర్వే చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు.

ఇతర నియోజకవర్గాల్లో భూమిపూజలు..

బాన్సువాడ నియోజకవర్గం మినహా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో ఈనెల 5నుంచే లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీల పంపిణీ ప్రారంభమైంది. లబ్ధిదారులతో మాట్లాడి అధికారులు ముగ్గులు పోసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. బాన్సువాడ నియోజక వర్గంలో ప్రజాపాలన పైలట్ గ్రామాలు మినహా ఇతర గ్రామాల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ప్రభుత్వం నుంచి మంజూరు ఇప్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

“ ఉత్తర్వులు రావాల్సి ఉంది



ఇందిరమ్మ కమిటీలు ఆమోదించిన లబ్ధిదారుల జాబితాపై గెజిటెడ్ అధికారుల రీసర్వే పూర్తిచేసి తుది జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపించాం. జిల్లాకలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి ఆమోదం లభించగానే గ్రామాల్లో లబ్ధిదారులు సూచించిన ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ నిబంధనలు, సరైన కొలతల ప్రకారం ముగ్గులు వేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– సత్యనారాయణ, డీఎల్‌పీవో, బాన్సువాడ

కాలనీవాసులు అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి అర్బన్: పట్టణ ప్రజలు, భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా పంచముఖి హనుమాన్ కాలనీ వాసులు, ఆలయ ధర్మకర్తలు, పెద్దలు ఆలయ ప్రహరీ నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా సహకారం అందించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. పంచముఖి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి కల్యాణానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ పోషకులతో మాట్లాడారు. ఆలయంలోకి మురికికాలువ నీరు చేరుతుందని భక్తులు తెలుపగా తాను సూచించిన విధంగా సహకారం అందిస్తే అనుకున్న విధంగా నెలరోజుల్లో అభివృద్ధి చేస్తానని, ఆలయానికి ఆదాయం వచ్చే విధంగా మడిగెలు నిర్మించి ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, అర్చకులు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందించాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏవో మణిదీపిక

దోమకొండ: వర్షాకాలం ప్రారంభమైనందున విత్తన దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయాధికారి మణిదీపిక అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రైవేట్ విత్తన రిటైలర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. డీలర్లు స్టాక్ ఎంట్రీ కోసం రిజిస్టర్లను నిర్వహించాలని, విత్తనాన్ని కొనుగోలు చేసిన కంపెనీ వివరాలు భద్రపర్చుకోవాలని సూచించారు. రైతులకు విత్తన అమ్మకాల రసీదులను తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యత గల పత్తి విత్తనాలను మాత్రమే అమ్మాలని సూచించారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనవద్దని, ఎల్లప్పుడూ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో కృష్ణారెడ్డి తదితరులున్నారు.

జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



జీలుగ విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : రైతులు జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ సహకార సంఘంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కిలోల జీలుగ విత్తనాల ధర రూ.4275 ఉంటే సబ్సిడీపై రూ.2137.50 అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, ఏడీఏ ప్రసన్న రాణి, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణరెడ్డి, నాయకులు మోహన్ నాయక్ తదితరులున్నారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న పోచారం

బాన్సువాడ రూరల్ : మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప మందిరంలో శుక్రవారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. దుర్కి వెంకట్ రావు పంతులు ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి, వేదాశీర్వాదం నిర్వహించారు. ఈవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు. కుర్మ యాదవ సంఘం సభ్యులు వీరిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు నార్లసురేష్, మోహన్‌నాయక్, పర్వుగౌండ, మోహన్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే మదన్‌మోహన్
- అభివృద్ధి పనులకు భూమిపూజ



గాంధారిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

గాంధారి(ఎల్లారెడ్డి): నియోజక వర్గంలో గాంధారిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. శుక్రవారం ఆయన గాంధారి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, కొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాంధారి–కామారెడ్డి ప్రధాన రహదారి నెహ్రూ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నూతనంగా వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన దత్తాద్రి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికడతాం



సాక్షి ఎఫెక్ట్..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని టికారం తండాలో తాగునీరు వృథాను అరికడతామని జీపీ కార్యదర్శి సాయిలు పేర్కొన్నారు. తాగు నీరు వృథా అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సాయిలు తండాకు చేరుకొని తండావాసులతో మట్లాడారు. రోజు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు నీటిని వదులుతామని ఆ సమయంలోనే నీళ్లు పట్టుకోవాలని సూచించారు.

గుంతలమయంగా రోడ్డు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని పెద్ద ఎక్లార బీటీ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. మండలంలోని ఎక్లార గేటు నుంచి పెద్ద ఎక్లార వరకు నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కామారెడ్డిలో జలమయమైన కోర్టు రోడ్డు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని వివేకానంద కాలనీ కోర్టు రోడ్డు చిన్నపాటివానకే జలమయంగా మారింది. ఏళ్లుగా మురికికాలువ సమస్య ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి కాల్వల నీరు రోడ్డుపైకి చేరగా మరో పక్క రైల్వే ప్రహరీ ఉండడంతో నీరు వెళ్లే దారి లేక మొత్తం జలమయం అయింది. గ్రావిటీ ఆధారంగా మురికికాలువ నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయని కాలనీవాసులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చిన ఆటోడ్రైవర్లు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ రోడ్డుపై ఏర్పడిన చిన్న చిన్న గుంతలను శుక్రవారం ఆటోడ్రైవర్లు పూడ్చివేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం గుర్తించిన ఆటోడ్రైవర్లు దత్తు, గోపాల్, వెంకటేశ్ తదితరులు మొరం పోసి గుంతలను పూడ్చారు. ఆటోడ్రైవర్లు చేసిన పనికి పలువురు వారిని అభినందించారు.

రోడ్డు పక్కన డ్రెయినేజీలను నిర్మించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి– ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీని నిర్మించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరతున్నారు.

‘ఆధునిక బోధన విధానాలను అనుసరించాలి’



కామారెడ్డి అర్బన్: ఆధునిక బోధన విధానాలను అనుసరించి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయ శిక్షణ జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తుండగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సమన్వయకర్త పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు పేపర్ ఫోల్డింగ్ విధానంతో తయారు చేసిన ఉత్తమమైన అభ్యసన సామగ్రిని పరిశీలించి అభినందించారు. ఇన్‌చార్జి నరహరి రాజు, తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, రామారావు, కుమారస్వామి, గోవర్ధన్, వేణుగోపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యా బోధన చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఆట పాటలతో విద్యా బోధన చేయడంతో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని మండల విద్యాధికారి షౌకత్‌అలీ అన్నారు. ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా లింగంపేట మండలం నల్లమడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ‘పోరు తెలంగాణ’ జానపదాన్ని స్వయంగా రచించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయున్ని అభినందించారు. ప్రాథమిక స్థాయిలో పిల్లలను తీర్చిదిద్దితే ఉన్నత తరగతుల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు బత్తుల రాములు, చంద్రశేఖర్, దామోదర్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్
- పలు చోట్ల కొనుగోలు కేంద్రాల పరిశీలన



సరంపల్లిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి రూరల్/దోమకొండ/సదాశివనగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వి. విక్టర్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో, దోమకొండలో, సదాశివనగర్ మండలం కుప్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డిల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతుందని, ముందస్తుగా తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించాలని కేంద్రం ఇన్‌చార్జిలను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్ లను కప్పివేయాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్లు జనార్దన్, గంగాసాగర్, సంజయ్‌రావ్, సింగిల్ విండో సీఈవోలు సతీశ్, బాల్‌రెడ్డి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీఎం రాజిరెడ్డి, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల ఊరేగింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మకు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో వైభవంగా బోనాలు ఊరేగించారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, కులస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీసేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాత దివ్యసమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులుపాల్గొన్నారు.

సంక్షిప్తం

పూర్వవిద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల పూర్వవిద్యార్థులకు వృత్తినైపుణ్యంపై శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ తెలిపారు. 2017 విద్యా సంవత్సరంలో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం పొందలేని పూర్వ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తి గలవారు ఉంటే గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రేపు ప్రతిభా పురస్కారాల అందజేత

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన మున్నూరుకాపు సంఘం విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు పటేల్, అంజయ్యపటేల్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ డివిజన్ విద్యార్థులకు పురస్కారాలు అక్కడి బాధ్యుల అభిప్రాయం ప్రకారం తర్వాత అందజేస్తామని వారు పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్వరాల్, దగ్గి అటవీ ప్రాంతంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శరవణన్, ఛీఫ్ కన్జర్వేటర్ రాజన్న, జిల్లా అటవీ అధికారి నిఖిత, డివిజనల్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఫయాజుల్లా తెలిపారు. బోర్లం, తాడ్కోల్, దేశాయిపేట్ సహకార సంఘాల్లో 50శాతం సబ్సిడీపై విత్తనాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జీలుగ విత్తనాలు కేజీ ధర రూ. 142.50 కాగా 50శాతం సబ్సిడీపై రూ. 72.25కు అందిస్తున్నామన్నారు. భూసారం పెంచుకోవడానికి జీలుగ విత్తనాలు ఉపయోపడ్తాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటివైద్య శిబిరం



పిట్లం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.